# వీర ధువకుడు.

OFFICE OF THE REGISTRAR ...
7th OCT 1937

Sl No. 213
Acc No 6729

రచయిత:

యం. పరంధామయ్య.

10

# అంకితము.

సీ॥ ఏపాటబాడిన • నేయాటయాడిన
సామ్యవాదమెగోరు • సద్గుణుండు
ఏచోట్లకరిగిన • నచ్చోటనే ఘోర
విప్లవంబులనెత్తు • వీరవరుడు
దేశీయగీతాలు • ధీరత్వమునబాడి
దాడిమార్గముజెప్పు • ధైర్యశాలి
యువకుల దరిజేరి • యుత్సాహమునుగూర్చి
భారతీయతనిల్పు • భాగ్యశాలి
తే॥ గీ॥ బవలురాత్రియు ననకను • బట్టుబట్టి
దేశసేవయె జీవితో • ద్దేశమనుచు
నిశ్చయించిన యువకుడె • నిశ్చయముగ
నాదు యంకితమును బొంద • నర్హుడయ్యె!

---

ఈ చిన్నిపొత్తమును రచించుటలోను, ప్రచురణచేయుటలోను నాకుఁ జేయూత నొసంగిన నా మిత్రులకు కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాను. ఇట్లు,

యం. పరంధామయ్య.

# సవరణ.

15వ పుట రెండవపంక్తి "కష్టజీవుల కుత్తుకల్కత్తిరించెను" అని అచ్చుపడినది. దానిని పాఠకులు "కష్టజీవుల కుత్తుకల్ …కురుగాక.

# వీర యువకుడు.

1వ రంగము.

[ "మీాయూరు" అనే ఒక కుగ్రామమునకు మైలు దూరమునవున్న కార్మికపల్లె సమీపమందు పొలములో కొన్ని ఆవులు, గేదెలు మేస్తుంటాయి—పశువులముందు 'యువకుడు' పుస్తకం చదువుతూ కూర్చుంటాడు - వెనుకనుండి కామందు వస్తాడు. ]

కామందు:— ఓరి! వెధవ............కొడుకా!

యువకుడు:— (త్రుళ్ళిపడి లేచును)

కా:— పుస్తకాలు చదువుతున్నావటరా? గొడ్లనుకాచే గాడిదకొడుక్కి పుస్తకాలు కావాల్సొచ్చినాయా? గొడ్లను వదలిపెట్టి పుస్తకాలు చదువుకుంటావనేనా నీకు జీతం కొలవడం?

యు:— లేదుదొరా! (చేతులు నలుపుకొంటూ) ఏదో చదవడం వ్రాయడం కొంతవరకు నేర్చుకున్నాను. అది మరచిపోతాననే భయముచేత పుస్తకం తెచ్చుకున్నానండి దొరగారు!

కా:— ఛీ! గాడిదా నోరుముయ్యి. గొడ్లను వదలిపెట్టి చదువుకొంటుంటే అవెక్కడికయినా పోతే నీ యబ్బగాడినను తోలుకొస్తాడురా?

యు:— లేదు! బాబయ్యా! ఇక్కడ పచ్చిక బాగావుంది. దూడలన్నీ కదలకుండా మేస్తున్నయి. అందుకని చదువుకుంటున్నాను దొరా!

కా:— ఓరి వెధవముండాకొడకా! అదిగాదురా! కన్నుమూసి తెలిచేలోపల పారిపోయే బుర్రావు నీవు ఇలా కూర్చుంటే అదుంటుందట్రా?

యు:— అందుకనే బాబయ్యా బుర్రావుకు దగ్గరగానే కూర్చున్నాను.

కా:— అనుక్కుతినే గాడిదకొడుకా! ఎక్కడ కూర్చున్నావు? చూడు ఆవు అప్పుడే ఎంతదూరం పోయిందో? ఆ?
(చేతులోని చింత బెత్తముతో పిఱ్ఱలమీద చెళ్ళున ఒకటివేస్తాడు)

యు:— (ఏడుస్తూ పిఱ్ఱలు నలుముకొంటూ ఆవువైన పరుగెత్తి బుర్రావును తిరుగగొడతాడు.)

కా:— ఏడుపు కట్టిపెట్టి యిలా రావేం?

యు:— (వెక్కి వెక్కి యేడుస్తూ వణికిపోతూ అడుగు ముందుకు సాగక మెల్లగా వస్తాడు.)

కా:— నేనుండగానే ఆవును వదలిపెట్టావే! నేను లేనప్పుడు సరిగా కాపలా కాస్తున్నావా?

యు:— తమరు పెద్దకేకలు వేస్తుంటే యిదే సందను కొని వెళ్ళిందండి.

కా:— టట్. వెట్టిముండాకొడుకా! నేను పెద్దకేకలు వేస్తుంటే దానివంకెవరు చూడరని తెలిసిపోతోందటరా? ఆ? ఉ! (చెళ్ళున మరి రెండు వేస్తాడు.)

యు:— అమ్మోయి! బాబోయి!
... ...డి యేడుస్తుంటాడు.)



కా:— యికమీదట యిలా ప్రవర్తించావంటే నీ ప్రాణాలు తీస్తా. జాగ్రత్త!

(కామందు వెళ్ళిపోతాడు.)

యు:— అబ్బా! నేనింక బ్రతకడం యెందుకు? బ్రతికియుండి యీ నస్థపడేకంటే చస్తే బాగుంటుంది. ఈ బాధలింకెన్నాళ్ళనుభవించాలి? నన్నీదొర యిలా చావగొట్టడానికి నేనేమి తప్పుచేశాను? పుస్తకం చదువుకొంటున్నంత మాత్రాన యిన్ని దెబ్బలు గొట్టాడే యేనన్నా తప్పుచేస్తే బ్రతుకనిస్తాడా?

ఓ భగవంతుడా రక్షించవా? ఆపదలందు నిన్ను దలచుకుంటే రక్షిస్తావని పెద్దలు చెపుతారు. అనంతా వట్టిదేనా? కాపాడవా? చేయరాని పని నేనేమి చేశాను. కుచేలోపాఖ్యానము చదువగూడదనా? నీకథను చదివి నీవు కుచేలుని రక్షించావని తెలసికొని సంతోషించానే! దీనరక్షకుడవని నిన్ను నమ్మితినే! కామందు కొట్టిన దెబ్బలలో నొకదానినైనా అడ్డగించలేకపోయావా? నీవు కాపాడక, కామందులు గాపాడక యెవరు రక్షించక నాబోటి యనాథులేమిగావాలి? అబ్బా! చుఱ్ఱుచుఱ్ఱుమని శిరస్సుకెక్కిపోతోంది బాధ. నాబోటి దరిద్రులీ ప్రపంచములో యెంతమంది యున్నారోగదా! (కొంచెము తడవుండి) ఎంతయేడ్చినా యింతే! నాకష్టాలు తీరే మార్గం చెప్పేవాడు లేనప్పుడు దుఃఖిస్తే మాత్రం ప్రయోజనమేముంది! ప్రొద్దుగూడా గ్రుంకిపోతోంది. దూడని ...

2వ రంగము.

[చక్కని మేడ- విశాలమైన దొడ్డి- పశువుల చావడి.
యువకుడు గొడ్లను కట్టివేస్తుంటాడు.]

అమ్మగారు:— ఒరేయి! గొడ్లవాడా!

యు:— అమ్మా!

అ:— ఇలా రా!

యు:— (వస్తాడు)

అ:— చిట్టమ్మ బయలుకు కూర్చుంది. తీసెయ్యి.

యు:— చిత్తం....................

[ప్రక్కనున్న చెంబులోని నీళ్ళతో చిట్టమ్మకాళ్లు గూడా కడుగుతాడు.]

అ:— అయ్యో నీజిమ్మడ! అదేమిట్రా!

యు:— చిట్టమ్మకాళ్ళుగూడా కడిగానమ్మా!

అ:— ఓరి ముదనష్టపు ముండాకొడుకా! నిన్ను కాళ్లు కడగమన్నవాళ్ళెవరు? ఆ! (చీపురుతో కొట్టుంది.) తియ్యి నీకు రోగంరాను! చిట్టమ్మ చొక్కా తియ్యి! గడ్డి కాస్త మంటబెట్టి ఆ మంటలో చెంబువేసి కాల్చు.

యు:— (చెంబుతోపాటు చొక్కాగూడా మంటలో వేసి చిట్టమ్మదగ్గఱకొస్తాడు.)

అ:— నీళ్లు పోస్తాను. ఆచొక్కా తడిపి చావు?

యు:— ఏచొక్కా అమ్మా!

చిట్టమ్మదిరా!



యు:— చెంబుతోపాటు మంటలోవేసి కాలుస్తున్నాను.

అ:— అయ్యో! నీపొగరుదియ్య. నీశిరస్సు బ్రద్దలుగాను. నీనోరు నొక్కుకొనిపోను. నీకేరోగం రాదేమిరా! వరహావంటి చొక్కా మంటలో గలిపేశావు. ఈవిధంగా మా సొత్తెంత పాడుచేస్తున్నావురా? (చీపురుతో కొడుతుంది.)

యు:— మీరే కాల్చమంటిరిగా అమ్మా?

అ:— నేను చెంబు కాల్చమన్నానుగాని చొక్కా తగులబెట్టమన్నానా?

చిట్టమ్మ:— అమ్మా!

అ:— ఆ!

చి:— బుర్రావు చిక్కుడుపాదంతా తినేసిందే!

అ:— అయ్యో నీజిమ్మడ. ఆవునెందుకని కట్టివేయలేదు?

యు:— నేను దూడల్ని కట్టివేస్తుండగా మీరు పిల్చారు. బుర్రావును లేగదూడల్ని కట్టివేయకుండానే వచ్చానమ్మా!

అ:— కట్టివేయకుండా రావడానికి నీకేంరోగంవచ్చింది?

యు:— పిలవగానే రాకపోతే కొడతారుకదండి.

అ:— గొడ్లను కట్టివేస్తున్నానంటే చంపుతానా?

యు:— ఆవేళ మీరు పిలిస్తే మొద్దును కట్టివేస్తున్నానమ్మా అంటే పిలవగనే రాకుండా యేదో పనిచేస్తుంటావా అని నన్నుకొట్టి పైపెచ్చు యెప్పుడైనా యెంత పనియున్నా సరే పిలవగానే రమ్మన్నారుగదండి తమరు.

మా... అ:— నీ ప్రేగులుదియ్య! యెప్పుడూ బాబయ్యగారు.

గదా! చెయ్యవుగదా! (చీపురుకట్టతో కొట్టుతుంది యువకుడు యేడుస్తుంటాడు.)

కామందు:— ఒరోయి! మాలాడ!

యు:— (దుఃఖాన్నాపుకొని) బాబూ!

కా:— దూడల్ని విడిచావురా?

యు:— ఇంకా లేదండయ్యా!

కా:— దూడలు పాలు గుడుస్తున్నాయేం?

అ:— అయ్యో వీడమ్మకడుపు కాలిపోను. ఇవ్వాళ పాలు గూడా లేకుండా చేశాడు.

యు:— ఏరా! దూడల్ని యెందుకు వదలిపెట్టావు.

యు:— గొడ్లను కట్టివేస్తుండగా అమ్మగారు పిలిస్తే వెళ్లానండి బాబయ్యగారు.

కా:— దూడల్ని కట్టివేసి వెళ్ళలేకపోయావా?

యు:— తొందరగా వెళ్ళకపోతే అమ్మగారు కొడతారండి ఇదివరకొకసారి అలా జరిగిందండి.

కా:— (తనలో) వీణ్ణి పొలంలోనే చావగొట్టాను. ఇప్పుడుగూడా కొట్టకపోతే రేపు కమతం యెగవేస్తాడు. (ప్రకాశముగా) యేడ్చావులే పో! దూడలకు మేత సర్దు.

యు:— (గొడ్లకు మేతవేస్తూ) దరిద్రుడు మంచిచేసినా తప్పే. చెడుచేసినా తప్పే. డబ్బున్నవాడేదిచేసినా మంచేనంటారు. ధనవంతుడు ఖూనీచేసి లంచాలుబెట్టి కేసును కొట్టివే...ంటే వాడు నిర్దోషి అంటారు. దరిద్రుడేమి చెయ్య...

యు:— ఏమి...

... చిట్టమదిరా!



ఖూనీజరిగిన స్థలానికి దగ్గరగా నడచిపోతే వాడే ఖూనీచేశాడంటారు. నాబోటి దరిద్రుడు కాస్త దగ్గఱగాబోతే అంటుకున్నాడని తిడతారు. వీళ్ళ ఆచారం తగులబడిపోను. వీళ్ళ మతం మట్టిలో గలసిపోను. ఇదేమిమతమో! పెడమతం. వాళ్ళబ్బా యెప్పుడు స్కూలులో మావాళ్ళతో కలిసి తిరిగివచ్చి బట్టలన్న విప్పకుండా అన్నం తినేస్తాడు. అప్పుడంటులేదుగామోసు. నేనేమన్నా వాళ్ళింట్లో జొరబడ్డానా? వాళ్ళ ప్రక్కలమీద పడుకున్నానా? చెంబునగైనా అయితే మంటలో కాల్చాలట. మనుష్యుల్ని, గుడ్డల్ని తడిపితే చాలట. అంటు పోతుందట. అంత అంటున్నప్పుడు చెంబుతోపాటు చొక్కాను, చిట్టమ్మను గూడా మంటలో మాడిస్తే అంటు పూర్తిగా పోతుందిగా. అసలిది యదార్థమయితేగా. ఇదంతా దొంగకల్పన. నాబోటి వాళ్ళని దూరంగానిలబెట్టి వాళ్ళ చెయ్యి పైననిపించుకొనడానికేసిన ఎత్తు. జరుగనియ్యి. వీళ్ళఆటలు యెన్నాళ్లు సాగుతాయో చూస్తాను.........  .....

కా:— ఏమే! అంత అర్జంటుపనే మొచ్చిందే నీకు.

అ:— (జరిగిందంతా చెప్పి) ఈగాడిదకొడుకువల్ల యేమీగాదండి. వీణ్ణితీసివేసి మరొకణ్ణి పెట్టుకుందాము.

కా:— ఈపనులు పూర్తయినతర్వాత అలాగే చేదాము. నీళ్లుపెట్టు. ఆకలి అవుతోంది.

(స్నానంచేసి ఈజీ చైర్‌లో కూర్చుంటాడు)

యు:— (తనలో) అబ్బా! అప్పుడే ఊరంతా మాటుమణిగిందే! (ప్రకాశముగా) ఇంటికెళ్తానండి బాబయ్యగారు.

యు:—(తనలో) బ్రతుకు జీవుడా. ఈనాడు యే అమ్మ ముఖం చూచానోకాని అదృష్టవంతుణ్నే.

.........................

యు:—(పుస్తకభాండాగారంవద్ద గొడ్లను ఆపి)ఏమండి బాబు! ఇవ్వాళ్ళ కొన్త మంచిపుస్తకం నాబోటి దరిద్రుల కష్ట నివారణోపాయము బోధించేదిగా చూచి యివ్వండి.

పుస్తక భాండాగారి:— వచ్చావటరా! (పుస్తకము వెదకి) ఇదిగో జాగ్రత్త! యెవరికి చూపించకు. తెలిసిందా?

యు:—చిత్తం.........ఏమిటి? సామ్యవాదమండి? అంటే ఆవేళ మీటింగులో కష్టపడి జీవించేవాళ్ళకు అన్నము పెట్టేది సామ్యవాదమంటూ ఒకాయన చెప్పాడు యిదేనండి?

పు:—అవును. ఇదే.

యు:—(పుస్తకం ఒడిలో దాచుకొని గొడ్లను తోలుకొని వెళ్తాడు.)

4వ రంగము.

యు:—బాబూ! పుస్తకమిదిగోనండి. ఈపుస్తకం నాకిచ్చి నన్నుద్ధరించారు. దీనికి మీకొక నమస్కారము కంటె యేమీ ప్రతిఫలం యివ్వలేనండి.

పు:—పిచ్చివాడా! నీబోటివాళ్ళు పదిమంది చదివి సామ్యవాదులయితే నాకదే పదివేలు. తెలిసిందా? సరేగాని రోజూ మీటింగోఅని గోలపెడుతున్నావు. సాయంత్రం ఏడు గంటలకు కర్షకపల్లిలో మీటింగు. వెళ్ళు.



యు:—(పట్టరాని సంతోషముతో) నిజమేనండి? ఐతే నాకు తీర్థయాత్రన్నమాట. యేమయినాసరే వెళ్ళితీర్తాను.

[నాటి సాయంకాలము]

కా:— అప్పుడే తోలుకొచ్చావేమిరా?

యు:— సుడిగాలికొట్టి గడ్డిమేటు నడికొప్పు లేచిపోయింది బాబు. వర్షమొస్తుందేమోనని తొందరగా వెళ్ళి నడికప్పు వేద్దామని వచ్చాను బాబయ్యా!

కా:— అయితే తొందరగా నెళ్లు.

యు:— చిత్తం...... (తనలో) అమ్మయ్యా! బ్రతికాను. (అని అనుకుంటూ కర్షకపల్లెకు వెళ్తాడు.)

5వ రంగము.

కా:—రాత్రి యెక్కడికెళ్ళావురా?

యు:—గడ్డిమేటుదగ్గఱ తేలు కుట్టిందిబాబు. ఆబాధ పడలేక అక్కడనుండి అలాగే యింటికి వెళ్ళాను దొరా!

కా:—తేలుకుట్టితే ప్రాణంపోతుందని పారిపోయావా? నీకు చావంటే అంత భయమున్నప్పుడు కామందుగారిసొమ్ము తింటున్నాము వారికి పని సరిగ చేయకపోతే యెలాగా అనే భయం ఉండొద్దటరా నీకు? ఆ?

యు:—ఉండాలండి బాబయ్యా!

కా.—అలాగైతే రాత్రెందుకని రాలేదు?

యు:— తేలుకుట్టిందని చెప్పానుగదండి. లేకపోతే యెందుకు రానండి. రోజూ జాము ప్రొద్దుపోయేవరకుండడం లేదండి

కా:—ఓరిదొంగ......కొడుకా! నాకోసం ఉంటావట్రా రెండుమూడురోజులనుండి నీకు ఆటలు యెక్కువైనయి తేలుకుట్టితే యింటికొచ్చి చెప్పి వెళ్లొద్దూ? నీయిష్టమొచ్చినట్లు పారిపోవడమేనా? ఆ? (కొట్టడానికి కఱ్ఱ యెత్తుతాడు)

యు:—కబడ్దార్! మాటలు ఖాళీగా రానీయకు. వీడెవడో కొంచెం తెలుసుకొని మాట్లాడు. ఇంతకాలంనుండి నీచే దెబ్బలుతింటున్న యువకుడు కాడని తెలుసుకో. దెబ్బకొట్టావంటే నీమర్యాద దక్కదు. జాగ్రత్త!

కా:—ఓరి! ద్రోహి! ఎదురుతిరిగావే! ఆ! అంతటివాడవయ్యావా? తిరుగుతావా యెదురు? ఆ? (కఱ్ఱతో వీపుమీద ఒకటి వేస్తాడు.)

యు:—(ఉద్రేకంతో) బద్మాష్! నీకింతపొగరా! (కట్టుగొయ్య విసరివేస్తాడు. కామందు చీలమండకు బలమైన దెబ్బ తగులుతుంది.) పో! నీయబ్బతో చెప్పుకో! నీలాంటి బద్మాషులదగ్గఱ నౌకరీ చేసేకంటే చస్తే మేలు.

## 6వ రంగము.

[మునసబుగారి యింటివద్ద]

కా:—ఏమండీ! మునసబుగారూ! మీసలహా యేమిటి!

ము:—నాకది నచ్చడంలేదండి. నీయంతటివాడు నా పాలేరు నన్నుకొట్టాడని చార్జియివ్వడం నాకేమీ బాగుండలేదు.

కా:— నేనూ అందుకే సంశయిస్తున్నానండి.



ము:— ఏదోవిధంగా వాడికి ప్రాయశ్చిత్తము చేయించండి. అంతేగాని యిది తలపెట్టకండి.

కా:— ప్రాయశ్చిత్తమేమిచేసేది? ఏదోమిషపెట్టి ఆస్థిపాస్థులు వేలం వేయిద్దామంటే కుక్కమంచము, మట్టిపిడత, పూరిగుడిసె తప్పితే యింకేమీ లేవు.

ము:—వాడికేమన్నా జీతం యివ్వాలా?

కా:—అవును. ఒక అంకెము ధాన్యము యివ్వాలి.

ము:—అవి సున్నజుట్టు.

కా:—అంతే? ఆపనే చేస్తాను.

ము:—మీతో చెప్పుదామని రోజూ మరచిపోతున్నానండి. వంటచెఱకుకోసం మహాఅవస్థపడుతున్నానండి. కొండామంటే సరియైన కట్టె దొరకడంలేదు. పైగా డబ్బు పిగలడం లేదు గూడాను. చాల చిక్కుగా ఉందండి.

కా:— మీకన్నానాండి. తూర్పు పొలాన బీడులో ఉన్నాయి తుమ్మలు. నాలుగు తుమ్మలు కొట్టించి తెచ్చుకోండి కావాలంటే మాజీతగాళ్ళను తీసికొని వెళ్ళండి. ఇదెంత భాగ్యమండి ఇంతమాత్రానికి మీరు చిక్కులు పడడమా?

ము:—చిత్తం........

కా:—వెళ్ళి వస్తానండి మునసబుగారు.

ము:—చిత్తం చిత్తం!

[తనలో] మంత్రం బాగాపారింది.

7వ రంగము.

[కార్మికపల్లె—కార్మికుడు కూర్చొని యుంటాడు.]

యు:—[కీర్తనపాడుచూ ప్రవేశము]

ఘోరము ఘోరము ధనికుల దౌర్జన్యం
దారిలేదే భారతరైతుకు ॥ఘో॥
కండలు కరిగించి కష్టించు కార్మికుల
పీల్చి పిప్పిచేసి పొందెదరు సౌఖ్యము ॥ఘో॥
కష్టజీవులకు కొఱతలేదందురు
కష్టజీవులకే కడుపునిండుట లేదు. ॥ఘో॥
కార్మికకర్షకులారా కరము కరము కలిపి
మూఢనమ్మకములను మూలకు ద్రొక్కియు
ధనికవాదులనెల్ల దగ్ధముచేయుడు ॥ఘో॥

యు:— గ్రహించావుగా! మన కామందుల దౌర్జన్యము

కా:—నాయనా! ఇది మనకు క్రొత్తకాదు. తాతముత్తాతలనాటినుండి వస్తున్న వారసత్వపు హక్కు. కామందులకు వారసత్వము వేలు యెకరాలు మనకు చీవాట్లు చెప్పుదెబ్బలు. మట్టి పిసికితేనేగాని నాలుగు వ్రేళ్ళు లోపలికిపోవు. ఇదంతా మన ఖర్మం. ఏంచేస్తాం?

యు:—అయ్యో! పిచ్చివాడా! అమాయకత్వముచేత అలా అనుకుంటున్నావు. మనమెంతకాలము ఇలా లొంగియుంటామో అంతవరకు మనఖర్మ మనుకోవాల్సిందే! ఏనాడు మనం కళ్లుతెఱచి మన బలాన్ని యుపయోగిస్తామో ఆనాడు ఖర్మ గిర్మ యెగిరిపోతుంది.



తే. గీ॥ ఖర్మనుచి మోహింపచేసె న • ధర్మముగను
కష్టజీవుల కుత్తు • క్కత్తిరించెను
యిట్టిఖర్మను మనమింక • బుట్టనంచి
ఖలుషచిత్తుల వధియింప • గదలవలయు.

స్వార్థపరులచేత సృష్టింపబడ్డయీ ఖర్మకామనము లోంకేది? మనమంతా ఒకమాటమీద యున్నట్లయితే ఖర్మ యడ్డగించగలదా?

కా:—నీవు చెప్పినది సత్యమే. వీళ్ళంతా ఒకమాట మీద యుంటారా?

యు:—వెఱ్ఱివాడా! నీకింక అనుమానమేనా? దానికి తగిన కట్టుదిట్టములున్నయి. వాటి ప్రకారం మనమంతా నడచుకోవాలి. ముందు మన సంఘం స్థాపించుకోవాలి. మనవాళ్ళనందఱిని సంఘములో జేర్చాలి. అపుడు వాళ్ళంతటవాళ్ళే కలసి వస్తారు.

కా:—సరె చూద్దాం.

యు:—చూదామంటేకాదు. రాత్రికి అందఱిని పిలిపించు తప్పకుండా. తెలిసిందా? [ఇద్దరు నిష్క్రమింతురు]

[ఆనాటిరాత్రి-కూలిసభాదృశ్యము.]

యువకుడు—పెద్దలంతా సభకు వచ్చినందుకు నాకు చాల సంతోషంగా యుంది.

మన తాతముత్తాతలనుండి కష్టించి బ్రతకడమే మన వృత్తి. అందుకు మనము గర్వించాలి. కాని ఆకష్టానికి తగిన

ఫలితము దక్కడములేదు. అందుకు విచారించవలసి వస్తోంది. రాత్రింబవళ్ళు పనిచేసేమనము, పంటలుపండించి కామందులకొప్పగించే మనము తినడానికి తిండి కట్టుకొనడానికి గుడ్డలేక అవస్థ పడుచున్నాము.

ఉ॥ మాయలు మర్మములెన్నని । మానసి కార్మికబిడ్డడీయిలన్
కాయము వంచియున్నరుగ । కండలకష్టము ధారవోయుచున్
రాయలభుక్తి దాతయయి । రక్షణలేకను బిక్షమెత్తుచున్
గాయమునొందియున్నడున । పాయమునొందుట కేమిహేతువో

కష్టజీవులీ విధమైన యవస్థల పాలుగావడ మెందుచేత? పనిపాటలు లేని షాహుకార్లు లక్షలకు అధికారులు గావడ మెందుచేత? మనకు ఐకమత్యములేక. మనకు పొట్టకు చాలి చాలనంత కూలినిచ్చి యెక్కువలాభాన్ని వాళ్ళు కొట్టివేయడం వల్ల. కాబట్టి మనము కడుపునిండం తిండి సంపాదించుకొనే మార్గం సంపాదించుకోవాలి.

అన్నిచోట్ల సంఘాలు స్థాపించాలి కట్టుబాట్లుచెయ్యాలి. అలా చేసిననాడు మా దెబ్బకు తిరుగుండదు.

సభ్యుడు:—అంతా ఒకమాటప్రకారము నడచుకోవడ మెలా కుదురుతుందయ్యా?

యు:—అమాయకుడా! ఎవరికి వారలా అనుకుంటే మనం సాధించగలమా! ఏపనిచేసినా కష్టజీవులే చేయాలిగాని మరెవరుచేయలేరు. ఇందుకనే కార్మికశక్తి మహాశక్తి యన్నారు ఈశక్తికి మించినదేదీలేదు. కాబట్టి మీరంతా సభ్యులుగాజేరండి



[ సభ్యుల జాబితా తయారు చేస్తాడు. ]

తరువాత మీరొక పనిచేయాలి. పనియున్న దినములలో ఓపికయుంటే నెలకు తలకొక సోలెడుధాన్యం సభ్యత్వపు చందా యివ్వాలి. ఆచందా వసూలుచేసి ఒక పెద్ద దగ్గర యుంచాలి. ఆసొత్తును సంఘాభివృద్ధికోసము ఖర్చుపెట్టాలి. ప్రపంచ పరిస్థితులు తెలిసికొనడానికి కనీసము వారపత్రికయినా తెప్పించుకోవాలి కార్మికకర్షక సంఘాలకు సలహాలనిస్తూ వాటి పురోభివృద్ధికై పాటుబడే జాతీయ పత్రికల్నే తెప్పించుకోవాలి. షాహుకార్ల వద్ద డబ్బుతీసికొని వాళ్ళపక్షమున వాదించే దేశద్రోహకరమగు పత్రికలను తెప్పించరాదు.

స:—ఇతర పల్లెలలోగూడా సంఘాలు స్థాపించాలన్నారు. అదెవరు చేస్తారు?

యు:—భేష్! మంచి ప్రశ్న అడిగావు. ఆపనికై నేనే బయలుదేరుతాను. మరియిద్దరిని తోడుయివ్వండి, నిరాఘాటంగా పని పూర్తిచేసుకొస్తాను. మనప్రాణములకంటె యెక్కువ జాగ్రత్తగా పోషించాలి సంఘాన్ని. అదిమాత్రం గుర్తుంచుకోవాలి. ఏదీ! ఒకసారి జై యనండి.

అందరు:—కూలిసంఘాలకు. జై-జై-జై.

## 8 వ రంగము.

[ ఆరుమాసములతర్వాత. ]

కూలిసంఘ కార్యాలయములో సంఘకార్యదర్శి కూర్చుని యుండగా యువకుడు వస్తాడు.

యు:—అన్ని సంఘాలకు సర్క్యులరు పంపారండీ?

కార్యదర్శి:—ఆ! పంపించానండి. కర్షకపల్లె వ్యవహార మెలాయుంది?

యు:—చాలా బాగాయుంది. సభ యేర్పాట్లన్నీ రైతులే జేశారు.

కా:—మనవాళ్ళ నందరిని కలసికొని రేపుదయం కర్షకపల్లెకొచ్చి సభకు హాజరుకమ్మని చెపుదామురండి.

[ కర్షకపల్లెలో-కూలిమహాజన సభాదృశ్యము. ]

అధ్యక్షుడు:—సోదరులారా!

నేనిట్టి మహాసభకు అధ్యక్షపదవి నొందగల్గినందుకు మీకు కృతజ్ఞతాపూర్వక వందనము లర్పిస్తున్నాను.

నేడు మనమిచట మన భావిజీవిత సమస్యల చర్చించి మనకు సుఖసంపదలను చేకూర్చే మార్గములను తెలసికొనుటకు సమావేశమయినాము. ఈసభా నిర్ణయప్రకారము మనమందరము ప్రాణముల వీడుటకైనా వెరువక ధైర్యముతో ఆమార్గములను సాధించాలి.

మీకు చిరపరిచితుడును రాత్రింబవళ్ళు నిద్రాహారములుమాని కూలిసంఘముల స్థాపించి కూలిసేవ చేస్తున్న మీ సోదరుడు యువకుడు ఆవిషయములను గురించి మాట్లాడనున్నాడు. కాన శ్రద్ధాభక్తులతో వారి యుపన్యాసమును వినగోరుచున్నాను. (కరతాళములు)



యు:—సోదరులారా! మీరెంత దూరాన్నుండియో శ్రమను తలచక కాలినడకనువచ్చి యీసభకు హాజరైనందుకు మీకు కృతజ్ఞతాపూర్వక వందనములు. నేడు మనదేశములో నూటికి తొంబదిమంది బీదవాళ్ళున్నారు. ఈబీదవాళ్లు తినడానికి తిండిలేక భోరున యేడుస్తున్నారు. మనమంతా అదే జాతిలో నున్నాము. ఇంతమంది తిండికై యల్లాడుతుంటే పదిమందిమాత్రం సుఖంగా మేడలలో తులుకుతున్నారు ఈ వార్తవినగానే మనకొక ప్రశ్న తట్టుతుంది. ఏమది? తొంబదిమంది తిండిలేక మాడడము పదిమంది పొట్టలు బ్రద్దలగునట్లు తినడమేమిటని. ఈహెచ్చుతగ్గులు యెందుకని యేర్పడ్డవి? ఈతొంబదిమంది పనిచేయక యవస్థపడుచున్నారా? లేదే! రాత్రింబవళ్ళు రెక్కలు ముక్కలు చేసుకొంటున్నారే! ఆపదిమంది వీళ్ళకంటె యెక్కువ కష్టము చేస్తున్నారా? లేదే! రాత్రింబవళ్లు పనిపాటలుమాని సోమరులై తిని కూర్చుంటున్నారే! ఇంతకాలమునుండి యింత యక్రమము జరుగుచుండగా అధిక సంఖ్యాకులయ్యు యిడుములు గుడుస్తున్న యీ కష్టజీవులు హెచ్చుతగ్గుల్ని నశింపజేసి సమాన తత్వము అంటే సామ్యవాదాన్ని యెందుకని అమలు జరుపలేరు? అసలు రహస్య మిదిన్నమాట.

వీరికి నిజస్థితిని గ్రహించేశక్తి లేదన్నమాట. ఆశక్తి మనవాళ్ళ కెందుకని కలగడంలేదు? ప్రబోధంలేక. విద్యావ్యాప్తి లేక. విద్య యున్నప్పటికి అట్టిశక్తి కూర్చగల సామ్య

వాద గ్రంథాలులేక ఒకటి అర యున్నా ఆ గ్రంథములను ప్రభుత్వము వారు నిషేధించడమువల్ల. సామ్యవాద గ్రంథాలు ప్రచారములోనికొస్తే సామ్యవాద సిద్ధాంతాలు ప్రజాసామాన్యములో జీర్ణిస్తే ధనికవాదం దాక్కుంటుంది. సామ్రాజ్య వాదానికి చేటొస్తుంది. మనకు జయముకలుగుతుంది. మనము సుఖంగా కాలం గడుపుతాం. తెల్లవాళ్లు యింటిదారిపడతారు. అందుకని యీ గ్రంథాల్ని అరికట్టారు ప్రభుత్వమువారు. అందుకోసమే ధనికులకు చేయూతనిస్తున్నారు. చట్టాలు గల్పించి జాతిమతవైషమ్యాలు పెంచి మనల్ని బూడిదపాలు చేస్తున్నారు. కాబట్టి యీ ప్రభుత్వ విధానాన్ని భగ్నం చేయాలి మనము. లేకుంటే మనల్ని జరిగినకొలంది జరుగమంటారు. కొన్ని వేలమైళ్ళ దూరాన్నుండివచ్చి మనమీద యధికారం చలాయించి మనకు చేటు తెస్తున్నారు. అంతా విరుద్ధమే! వారు పరిపాలకులట. మనము పరిపాలితులమట. దీనికి భారతీరుడెవడు ఒప్పుకోడు. వారు నెత్తిమీద మొట్టుతుంటారట మనము తలవంచుకోవాలట. పైపెచ్చు వీరికి మనషాహుకార్లు మద్దతుకూడాను.

మన షాహుకార్లు యింగ్లీషువారి మడమతాపులుతింటూ ఆతాపుల్ని మల్లెపూవులుగా భావించి వారిక్రింద తొత్తులై మనల్ని తొత్తుక్రిందబడి తొత్తులుగా చేస్తున్నారు మనమీద అధికారం చెలాయిస్తున్నారు. మీకు అన్నము బెట్టుతున్నాం కాబట్టి మేము చెప్పినట్లు వినాలంటారు. తల యెత్తనీయరు.



కాలు మడువనీయరు. నిద్రపోనీయరు. చావనీయరు. బ్రతుకనీయరు. వారు కామందులట. మనము జీతగాళ్ళమట. వారు మేడలలోనట. మనము గుడిసెలలోనట. వారికి పొట్టలు బద్దలగునట్లు నవకాయపిండివంటలతో భోజనమట. మనకు ప్రేగులు మాడేట్లు మాడుచెక్కలు, మంచినీళ్ళట. వారికి హంసతూలికా తల్పములట. మనకు కటికనేలట. వారికి సుఖమట. మనకు దుఃఖమట. అంతా తమాషా! మేడలుకట్టేదిమనము. కాపురముండేది వాళ్ళు. ప్రక్క పాన్పులు వేసేది మనము. పరుండేది వాళ్లు. పంటలుపండించేది మనము. యనుభవించేది వాళ్ళు. రెక్కలు కష్టము మనది. కజ్జపెత్తనము వారిది. ఇదెంతవిరుద్ధం?

ఈవిరుద్ధాన్ని నిర్విఘ్నంగా సాగించడానికి దొంగశాసనాలు కొన్నింటిని సృష్టించారు. ఇదేమి అన్యాయమంటే నీఖర్మ మంటారు. కాదు. కాదు. ఖర్మం కానేరదు. ఆభగవంతుడు రాముని చిత్తమంటారు. ఇది కల్ల. ప్రకృతిలో మానవసంఘమంతా సుఖదుఃఖములను సమముగా పంచుకోవాలి.

తే॥ గీ॥ తగ్గుహెచ్చులు లేకను ♦ ధరను ప్రజకు
సిరియు సంపదల్సమముగ ♦ జెందకుండ
జలిఘనట్టి యీ యన్యాయ ♦ చట్టములను
గండ గూర్చిన రాముడు ♦ దైవముగునె॥

అందుకు విరుద్ధముగు శాసనములు గల్పించడానికి ఆరాముడెవడు? అతని కాయాధికార మెవరిచ్చారు? ఇట్టి స్వార్థలాభదాయకములయిన యీదొంగశాసనముల కంగీకరించిన రాము

డెలాంటిదేవుడు? వట్టిది. ఇదంతా బూటకం. స్వార్థపరులగు సోమరిపోతులసృష్టి. అమాయకులైన కష్టజీవుల్ని మోసపుచ్చి వాళ్ళరెక్కల కష్టాన్ని దోచుకొని తాము సుఖంగా కూర్చుని తినడానికి తిండిపోతులు పన్నినపద్మవ్యూహము. ఈపద్మవ్యూహమును భేదించివేస్తావేమోనని భగవంతుడనే మాయ ముళ్ళ కంచె ఉన్నదని భయపెట్టారు. ముళ్ళు గ్రుచ్చుకుంటాయేమోనని ఇంతకాలంనుండి అమాయకులమై దూరంగా యున్నాం.

సగమీయకపోయినా కనీసము ఐదూళ్ళయినా యివ్వుమని జూదగాని పక్షమున బేరంజరిపాడు కృష్ణుడు. కౌరవులు తిరస్కరిస్తే కృష్ణుడు యుద్ధాని కుసిగొల్పాడు. సామ్రాజ్యతృష్ణను పెంపుజేశాడు. ఈరాజ్యాన్ని పంచుకొనడానికి మీా కధికారము లేదనలేకపోయాడు. ఈరాజ్యం ప్రజలదనలేక పోయాడు. స్వార్థము కరుడుగట్ట బంధువర్గంతో సామ్రాజ్యపీఠము నలంకరింప సమకట్టాడు. ప్రజాసామాన్యాన్ని మాయజేశాడు. అమాయకులయిన ప్రజలు మాయకృష్ణుని విశ్వసించారు. యుద్ధమందు దుమికారు. లక్షలాదిగ హతులయ్యారు. ఇన్ని అక్షౌహిణీల ప్రజలు ఆరాజ్యంలోసుఖించడాని కవకాశము లేకుండాపోయింది శాంతిలేదు. ఎప్పుడూ రణభేరీలే! దీనికంతకూ కారణం? ప్రజల అమాయకత్వం కౌరవ పాండవుల నావరించినరాజ్యకాంక్షనా అనేస్వార్థం. ఈస్వార్థమునకు తావిచ్చాడు కృష్ణుడు. బలవంతులు బలహీనులను పొడిచి చంపుటకు అవకాశమియిచ్చాడు.



ఇట్టి దీనజనభక్షకుడైన కృష్ణుని దీనరక్షకుడని సంబోధించారు దేశద్రోహులు. కృష్ణుడు దేవుడన్నారు. దేవుడేది చేసినా మనమేలుకొఱకే నన్నారు. దుష్ప్రచారం చేశారు. ప్రజల్ని మోసగించారు. తమకోర్కెలను నెరవేర్చుకున్నారు. భగవంతుని దూషిస్తే పాపమన్నారు. చచ్చింతర్వాత యమబాధపడతావన్నారు. ఇదంతా బూటకముగాక మరేమిటి?

ప్రభుత్వపన్నులు తల బ్రద్దలుగొట్టుచుండ, బానిసత్వము కండ్లకు గంతకట్టుచుండ, ధనికుల దౌర్జన్యములు రెక్కల విఱిచి కట్టుచుండ, కడుపులో ఆకలిమంట రగులుచుండ, ఋణదాతలు కాళ్ళను పెనవేయుచుండ, కుయ్యో మొఱ్ఱోయని రైతులు యేడ్చుచుండ, చూచి యానందించే సోమరిపోతులుండ, యింత దారుణము జరుగుచుండ యిదియా యమలోకము వేరే యేదయినా యున్నదా? జీవించియుండగనే యిన్నియవస్థలు పడే వారికి చచ్చిపోయినతర్వాత యమబాధ వుంటుందంటే యేమి లెక్క? నిండా మునిగినతర్వాత చలియుంటుందా? కాబట్టి పుక్కిటిపురాణములను సరకుచేయగూడదు. దొంగకల్పనలకు లొంగకూడదు. ఈ దారిద్ర్యపిశాచాన్ని వదలించుకోవాలి. స్వార్థపరులైన వేరుపురుగుల్ని యేరి పాఱవేయాలి. ఆనాడు దుఃఖమెలా యుంటుందో మరచిపోతాము. ఆనాడేస్వర్గసౌఖ్యం. అప్పుడే యిది స్వర్గలోకమని పిలువబడుతుంది. అంతేగాని స్వర్గలోకముకోసం యెంతోదూరం వెళ్ళనవసరములేదు.

కూలిచాలక హెచ్చుకూలి అడిగితే కామందు యివ్వనంటాడు. ఎందుచేత? మనలో ఐకమత్యము లేక. అతన్నవ

కూలికే మరొకడొచ్చి చేస్తాననడముచేత. ఆకూలయినా యెప్పుడూ ఉంటుందా? ఉండదు. నాలుగురోజులుపని చేస్తే నాలుగురోజులు ఖాళీ. ఆనాలుగురోజులకూలి పొట్టకే చాలీచాలనంత. పనిలేనప్పుడు పస్తుండాల్సిందే. ఏపాటుతప్పినా సాపాటు తప్పుతుందా? కామందుల్ని రెండుకుంచాలధాన్యం అప్పు అడుగుతాము. కామందుకు బెట్టెక్కువ. రెండుకుంచాలకు నాలుగుకుంచాలివ్వాలంటాడు. లేకపోతే వీలుగాదంటాడు. కడుపులో మంట. ఏంచేస్తాం? ఊరుకుంటే గత్యంతరంలేదు. అందుకైన యంగీకరించి ధాన్యం తెచ్చుకుంటాము. కూలి తిండికే చాలనంత. ఇంక బాకీ యెలాతీరుతుంది? మనమంతా ఐకమత్యంగా యున్నట్లయితే యీదోపిడీకి తావుండదు. మనమంతా కట్టడి కలిగియున్నప్పుడు మనకు పోటీయుండదు. కష్టానికి తగినఫలం దక్కుతుంది. నేడు నిరక్షరకుక్షులమైయున్న మనము విద్యావంతులముకావచ్చు. 'ఆవు అంబాయనును. ఎద్దు అంకెవేయును' అనే విద్యగాదు మనకు కావాల్సింది. రాజకీయార్థికవిద్య. నేడు బ్రిటిషువారు మనకంటగడుతున్న దాస్య విద్యగాదు మనము కోరేది. స్వాతంత్ర్యపిపాస, ధీరత్వము, జాతిమతభేదరహితము, సమానతత్వము బోధించునట్టిది. మనమంతా యేకమైననాడు యీసౌకర్యాలన్నీ పొందగలుగుతాము.

మన ఐకమత్యబలాన్ని ఐక్యకంఠముతో మెలుగెత్తి చాటిననాడు సోమరిపోతులై మనల్ని పీల్చి పిప్పిచేసే ధనవంతులు, వడ్డీవ్యాపారస్తులు, పెట్టుబడిదారులు, జమీందారులు మొద



లగు రాక్షసచిత్తులైన ధనికవాదులును, సామ్రాజ్యవాదులను కట్టగట్టుకొని సింహమునుచూచిన మేకవలె మన ధాటికాగలేక గుహాలలో దాగగలరు. ఇంతశక్తి మనలోనే యున్నది. మన శక్తికి సాటిలేదు. మారణమంత్రములైన మరఫిరంగులబారి నుండియైన తప్పించుకొనవచ్చును గాని ఐకమత్యముతో గూడిన మన తిరుగుబాటుబారినుండి తప్పించుకొనలేరు మన శత్రువులు.

మనమింత యవకాశమును కలిగియుండియు మన కాంగ్రెసు స్వరాజ్యమును పొందలేకపోయింది. ఎందుచేత? యని యడుగవచ్చు. దానికి సమాధానం కాంగ్రెసు నాయకులు మన శక్తిని మనకు తెలియపర్చకపోవడంవల్లనని. లేకున్న యింతకాలము వృథాఅయ్యేదా? ఏనాడో శత్రువులు దేశాన్నివిడచి పారిపోయేవాళ్ళు. ఆనాడే కార్మిక కర్షకరాజ్యము స్థాపించబడేది. సోమరితనం నశించిపోయేది. నిరుద్యోగం నీల్గేది. ధనికవాదం దగ్ధమైపోయేది. పెట్టుబడివిధానం పాడైపోయేది. జమీందారిపద్ధతి యేటిలో గలిసేది. ఆకలిమంట అణగంటేది!

ఇట్టి శక్తిని గలిగియున్న మనకు మనబలాన్ని తెలియపర్చలేదు కాంగ్రెసునాయకులు. ఆకలిమంటతో కాలిపోతున్న మనల్ని రక్షించే మార్గాన్ని బోధించలేదు. సంపూర్ణ స్వాతంత్ర్యమును చేకూర్చగల విప్లవశక్తులను కూడదీయలేకపోయారు. అందుకు మూలసాధనమైన మన కృషికవర్గాన్ని మరచిపోయారు. పైపెచ్చు కార్మిక కర్షకసంఘాలను [illegible]

నాయకులు. కార్యక్రమములో మార్పును కలుగజేసికొనలేక పోయారు. ఎప్పటికాలిట్టే యున్నట్లు ఆ ఖద్దరే ఆ ఉప్పే ఆ సత్యాగ్రహాన్నే బట్టుకొని ప్రాకులాడారు. ప్రభుత్వపక్షపాతము వహించారు.

సభికుడు:— ఏమండోయి ఎన్నో సంవత్సరాలనుండి స్వరాజ్యంకోసం నానా అవస్థలుపడిన కాంగ్రెసువారిని దూషిస్తున్నారేమిటండీ?

యు:— అయ్యా! దయచేసి నే చెప్పినదంతా విని ప్రశ్నలు వేయండి సమాధానాలు చెపుతాను.

ఇన్ని యవస్థలుపడినప్పటికి ఫలితమెందుకనిగలుగలేదో గమనించాలి. అంతేగాని ఖద్దరువద్దన్నమాత్రాన నాయకులను ఖండించాననుకోవద్దు. సత్యాగ్రహం కూడదన్న మాత్రాన వారిని దూషిస్తున్నా మనుకోవద్దు అలా భావించడం చాలా పొరపాటు. కాంగ్రెసనే దొక సౌధము. ఆసౌధము నేడు శత్రువశమైయున్నది. ఆసౌధములో మనమంతా కాపురమున్నాము శత్రుబారినుండి ఆసౌధమును రక్షించే భారము మన యందరిదై యుంది. మనల నందరిని ఒకేబాటను నడిపించుటకు కొందఱిని నాయకులుగా నెన్నుకున్నాము. ఆనాయకులు మనకు శత్రువుల్ని యోడించే మార్గమేదో దాన్ని బోధించాలి. అలా గాకుండా నాయకులు వినాయకులైతే శత్రువులు మననెత్తిమీద పీఠం వేస్తారు. అందుకని తగుమార్గాలు వెదకాలి. ఒకమార్గము ననుసరించినపుడు ఆమార్గం మనల్ని గమ్యస్థానానికిజేర్చలేదని



తెలిసినపుడు దానిని వదలిపెట్టాలి. వేరొక త్రోవ చూచుకోవాలి. అలా కాకుండా ఆత్రోవ మనల్ని గోతికి యీడ్చేత్రోవని తెలిసియుండి ఆత్రోవనే నడవడం మనమూర్ఖత్వాన్ని వెల్లడిస్తుంది.

కాంగ్రెసునాయకులా మితవాదపంథానే నడుస్తున్నారు. దాన్ని మార్చమంటే మార్చవంటున్నారు. ఎప్పటికైనా ఈ కార్యక్రమంలోనే స్వరాజ్యం తెస్తామంటున్నారు. ఏమయినా సరే మీరు నమ్మాల్సే నమ్ముకొని యుండమన్నారు. కుక్కగొడుగుల్లాగ తలకొకసంఘం స్థాపించి వేరొకమార్గాన్ని వెదకి మా పలుకుబడిని తగ్గించవద్దంటున్నారు. అందుచేత కాంగ్రెసునాయకుల పురాణపంథామీద విరక్తి కలిగింది ప్రజలకు. నూతన నిర్మాణ కార్యక్రమము కావాలంటున్నారు. కాని నాయకులు నిరంకుశ పరిపాలన సాగించారు.

ఇప్పుడు మనమేమిచెయ్యాలి? విప్లవశక్తుల్ని అణగద్రొక్క సమకట్టియున్న మితవాదనాయకత్వాన్ని రూపుమాపాలి. స్వాతంత్ర్యపోరాటాన్ని అతివాదనాయకత్వమున సాగించాలి. నాయకత్వము మారినను సంస్థ మారజాలదు. మనమందఱము కాంగ్రెసుద్వారానే శత్రువుల్ని ఓడించాలి. అందుకొఱకు మనమంతా సంఘములో జేరాలి. కాంగ్రెసు భవనాన్ని కష్టజీవులైన కార్మికకర్షకులతో నింపివేయాలి. ఆనాడు మనస్వాతంత్ర్యసమరము విప్లవపంథా ననుసరిస్తుంది. ఆనాడు పరప్రభుత్వము దూదివలె యెగిరిపోతుంది. సామ్యవాద మమలులోకొస్తుంది.

సామ్యవాదమంటే కొంతమంది తెలియక భయపడుచున్నారు. తెలిసియుండియు తెలియనివారికి మరింత భయాన్ని కలుగజేస్తున్నారుకొందరు. వారే సోమరిపోతులగు ధనవంతులు. వాళ్ళకు సామ్యవాదముతో నిమిత్తముండదు. ఇలాఉంటే వాళ్ళ భోగాలకు లోటుండదు. పైగా కొంతమందిని తమ చెప్పుచేతల్లో యుంచుకొని కఱ్ఱపెత్తనము చేస్తూ పనిచేయించుకోవచ్చు. సామ్యవాదమువస్తే యీఆటలుసాగవు. అందుకని ప్రజలలో సామ్యవాదముపట్ల దురభిప్రాయాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తున్నారు. సామ్యవాదము కావాలంటున్న కూలిరైతులలోనే భేదములు గల్పించ జూచుచున్నారు. సామ్యవాదము కూలీలను రైతులమీదకు ఉసికొల్పుతుందంటున్నారు. ఇది శుద్ధవెఱ్ఱివాగుడు. రైతుకు కూలీకి భేదంలేదు. నేడు రైతులెట్టి యవస్థలు పడుతున్నారు?

సీ॥ ఎండవానల కోర్చి ♦ బండచాకిరిచేసి
సస్యము ల్పరిగాక ♦ సమయుచేము
యీనాముదారుల ♦ మనవారుగాజేసి
కొనుటకై యీడుములు ♦ గుడుచుచేము
రాత్రింబవళ్లు ని ♦ ద్రాహారములుమాని
కండలు కరగించి ♦ కష్టించుచేము
శిస్తుసీయగలేక ♦ సేద్యమే చేయక
వస్తులు బడియుండి ♦ జఱుగుచేము



ఇట్టి రైతాంగమునకింక ♦ యేదిదారి?
భరత ఖండాన యువజన ♦ భటులులేర?
రైతు సంఘాల నోదార్చు ♦ రాజులేడ?
రైతు సంఘమా నీకెంత ♦ రోతగలిగె!

అని గొల్లున గోలపెడుతున్నాడు రైతు. గొడ్డురాలిని పాలిమ్మన్నా, బిక్షగాని నియాచించినా యెంతఫలితమో కూలీలను యిలాంటి బీదరైతులమీద కుసిగొల్పితే అంతఫలితమన్నమాట. కాబట్టి సామ్యవాదులెప్పుడు కూలీలను రైతులమీద కుసిగొల్పరు. సామ్యవాదము కార్మికకర్షకులను కవలపిల్లలని సంబోధిస్తుంది గాని వేరుచేయదు.

ఇదేగాకుండా సామ్యవాదము విప్లవమును లేవదీసి రక్తపాతమును గలిగిస్తుందనికూడా అపోహలు కల్పిస్తున్నారు దేశద్రోహులు. సామ్యవాదము విప్లవమును కలుగజేస్తుంది. నిజమే. "విప్లవము" అంటే గొప్ప మార్పని యర్థము. ప్రజా ప్రబోధముచేసి సక్రమాందోళనజరిపి వర్గచైతన్యము గలిగించి ప్రజలందరు ఒక్కుమ్మడి స్వరాజ్యము కావాలని ఎదిరించి నిలబడునట్లు చేయడం. అంతేగాని సామ్యవాదము రక్త ప్రవాహమున కిచ్చగించదు. అసలు సామ్యవాదము యుద్ధ ప్రతికూలవాదము. అలాంటప్పుడట్టి అపోహాలు గల్పించుట వెఱ్ఱితనమని చెప్పాలి. స్వరాజ్యం కావాలంటే విప్లవమును లేవదీయాలి. విప్లవము వలదనడం స్వరాజ్యం వలదనడమన్నమాట

అది వివేకహీనుడు చెప్పేమాట. సామ్యవాదము మానవసంఘమంతా రాజకీయార్థికముగ సమాన సౌఖ్యమును పొందునట్లు జేస్తుంది. ఒకరిమీద నొకరికున్న అసూయతా సహ్యతలకు తావులేకుండ జేస్తుంది. జాతిమతభేదవాసన తగులనీయదు. మానవజాతిలో విద్యాహీనుణ్ని కనబడనీయదు. కష్టజీవుల రక్తమాంసాల్ని పీల్చే పెట్టుబడి విధానాన్ని తగులబెట్టుతుంది వస్తూత్పత్తిని వ్యక్తుల స్వాధీనములో నుండకుండా సంఘపరము జేస్తుంది. అంతర్జాతీయ సామ్యవాద స్వతంత్రమును స్థాపించమంటుంది.

తే॥ గీ॥ సంపదంతయు ప్రజలకు • సమముజేసి
విశ్వ మానవ కల్యాణ • వేదుకలను
గనులకింపుగ సతతంబు • గలుగజేయు
సామ్యవాదము విలసిల్లి • సత్వరముగ॥

ఇట్టి సామ్యవాదమునా వద్దనడం!? వలదనుటకు మానసిక హృదయు డెవడైనా అంగీకరిస్తాడా?

ఈ సామ్యవాదమును జర్మనీ దేశస్థుడు జ్యూ తెగకు జెందిన కెరల్ మార్క్సు కనిపెట్టాడు. ఈ సామ్యవాదమును అమలు జరుపవలెనని యెన్నో అగచాట్లు బడ్డాడు. తనజీవితమునంతయు సామ్యవాద ప్రచారనిమిత్తమై వినియోగించాడు. ఈసామ్యవాద సిద్ధాంతములను విశదీకరించి గ్రంథరూపమున అచ్చొత్తించి ప్రచారము చేశాడు. కేరల్ మార్క్సు ప్రపంచ భావిభాగ్యోదయానికి మార్గదర్శకుడయ్యాడు. నేడు మనకండ్ల



యెదుట రష్యాలోని ప్రజలు సామ్యస్వతంత్రులై సుఖసంపదలతో ఆనందాబ్ధి నోలలాడుట కీమహనీయుడే కారకుడు. ఈయన తన 65వ యేట చనిపోయాడు. తరువాత యీయన కృషి ఫలించినది.

సోవియట్ ప్రభుత్వభవనమునకు పునాదివేశాడు మార్క్సు. ఈయన సహచరుడు 'లెనిన్' రష్యాలో మార్క్సు సిద్ధాంతములను అమలు జరిపి సోవియట్ ప్రభుత్వభవనమునకు వలయు సామగ్రిని చేకూర్చాడు. నేడు 'స్టాలిన్' రష్యా సోవియట్ ప్రభుత్వ భవనాన్ని యసమాన సౌందర్యముతో శాశ్వతముగ యుండునట్లు నిర్మించాడు. రష్యా ప్రజల్ని సంతోషాంబుధిలో ముంచివేస్తున్నాడు. ప్రపంచములోని వివిధ దేశాలను రష్యాను ఆదర్శంగా తీసుకోమంటున్నాడు. నేడు రష్యా ప్రజలు సుఖజీవులు.

అది చాల కష్టమంటారు. అసలు మనదేశములో సామ్యవాదమే పనికిరాదంటారు స్వార్థచిత్తులు. అదిపొరపాటు నేటి పరిస్థితులనుబట్టి యేదేశమందైనను సామ్యవాద ప్రభుత్వాన్ని స్థాపించవచ్చు. బహుసులభం.

నేడు మనదేశములో అల్ప సంఖ్యాకులగు సోమరిపోతులు మితిమీరిన సౌఖ్యము లనుభవిస్తుంటే అధిక సంఖ్యాకులగు కష్టజీవులు మితిమీరిన కష్టాలనుభవిస్తున్నారు. కష్టజీవులకు ఉపకరించేది సామ్యవాదం. కష్టజీవులకు ఫలంగూర్చేది సామ్యవాదం. సోమరిపోతులను పస్తుండబెట్టేది సామ్యవాదం కాబట్టి సామ్యవాదము కావాలని యెవరంటారు? (సభలో-మేము.

మేము. కష్టజీవులము. సామ్యవాదమే కావాలంటాము) కాబట్టి సామ్యవాదమును కోరేది కష్టజీవులు. కష్టజీవుల సంఖ్య యెంత? అత్యధికము. సోమరిపోతులైన ధనవంతులసంఖ్య యెంత? అత్యల్పము. అలాంటప్పుడు అత్యల్పసంఖ్యాకులైన ధనవంతుల సౌఖ్యంకోసము అత్యధికసంఖ్యాకులగు కష్టజీవుల గొంతుకలు కోయడం న్యాయమా? కాదు. అందుచేత నేడు మనదేశములో సామ్యవాద ప్రభుత్వస్థాపన చేయుట ధర్మము. మన విధి. అలాచేయడం బహుసులభముకూడాను.

మనదేశములోని జనసంఖ్య 37 కోట్లు. అందులో ధనవంతులు 5కోట్లు. మిగతా 32కోట్లు కడుపు చేతిలో బట్టుకొని ఆకలి! ఆకలి!యని యేడుస్తున్నారు. అంతమంది ఆకలి! ఆకలి!యని యేడుస్తున్నారనగానే మీ శరీరం కంపించిపోవడంలేదు? ఒడలు పులకరించడములేదు? రక్తము ఉప్పొంగడములేదు? (సభలో విప్లవము వర్ధిల్లుగాక! అను కేకలు) ఆకలిబాధితులైన యీ 32 కోట్లలో 4కోట్లు నిరుద్యోగులై మాడుచున్నారు. 28కోట్లు కూలియో నాలియోచేస్తూనే బాధపడుచున్నారు.

సంపదంతా కొద్దిమంది వ్యక్తులవద్ద యినుపపెట్టెలలో మురిగిపోతోంది. వాళ్ళు తినడంలేదు. మనల్ని తిననీయడంలేదు. పైపెచ్చు యింకోలక్ష సంపాదిస్తే బాగుండును. ఇంకోకోటికి పడగయెత్తితే బాగుండును. ఇంకో ఊరు సంపాదించుకుంటే బాగుండును. ఇంకో రాష్ట్రము కలుపుకొంటే బాగుండును. ఇంకో దేశాన్ని సంపాదిస్తే బాగుండుననే యసంతృప్తితో బాధపడు



చున్నారు. ఇలాయున్నాయి పరిస్థితులు. కాబట్టి కష్టజీవులయిన మనము యేకగ్రీవంగా విప్లవము కలుగజేయాలి. దేశద్రోహులకు హడలు పుట్టించాలి. అప్పుడీ శత్రుమూకలు మనల్ని చూచి పిల్లిని చూచిన యెలుకలవుతారు అపుడు మనదే రాజ్యము మనదే స్వేచ్ఛ. కష్టంచేస్తే ముద్దపెడతాం. లేకపోతే పస్తుండబెడతాం. కష్టజీవులరాజ్యాన్ని స్థాపించుకుంటాం. రాజకీయార్థిక స్వాతంత్ర పరిపాలన లభిస్తుంది. మనమంతా సోదరభావంతో సుఖిస్తాం.

అయితే యింత మార్పెలా కలుగుతుంది? ఆవిప్లవ మెలా సమకూరుతుందని మీరడుగవచ్చును. అది కష్టసాధ్యమైన పని కాదు. నేడు మీరేస్థితిలో నున్నారు? స్వరాజ్యము కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధంగాయున్నారు. మీరిలా తయారుకావడానికి కర్తలెవరు? రాత్రింబవళ్ళు ప్రబోధంచేసి మీలో వర్గచైతన్యము కలిగించిన వీరయువకులు. ఆవిధంగానే అన్నిచోట్ల వర్గచైతన్యాన్ని కలిగించాలి. యావద్భారత కృషికవర్గాన్ని అట్టిస్థితిలోనికి తీసుకొనిరావాలి. ఆబాధ్యత యువకులది. ఏదేశమందైనను ఆయాదేశముయొక్క భావిభాగ్యోదయము ఆయా దేశీయ యువకులపై నాధారపడి యుంటుంది.

యువకులంతా యెక్కడివారక్కడే కార్మికకర్షకులలో యిలా ప్రబోధంచేయాలి. వారిని విప్లవమనగానే బంతియాటనుకొని పరుగెత్తుకొని వచ్చునట్లు తయారు చెయ్యాలి. అసలు రహస్యాన్ని మీచెవిలో ఊదితేచాలు యెవరు పిలవకుండానే

మీరే సిద్ధమయి మీరే నాయకత్వము వహిస్తారు. నిద్రమం
చముమీద నుండగా స్వాతంత్ర్యయోధుడా! విప్లవసమయము
వచ్చినదనగానే ఆయోధుడా పద్ధతులనుం దారితేసిన వాడు
గా తయారుకావాలి. అలా తర్ఫీయతుపొంది ఆయాప్రాంతము
లందలి పరిస్థితులను యెప్పటికప్పుడు నాయకుల కెరుకపర్చాలి
అప్పుడా విప్లవమార్గమున కెప్పుడు సక్రమ యవకాశమో ఆ
యవకాశాన్నెలా యుపయోగించుకోవాలో నిర్ణయించే
బాధ్యత విప్లవోద్యమ నాయకులదై యుంటుంది. వారు తమ
బాధ్యతను నెరవేర్చుకుంటారు. విప్లవము యేకకాలమునం దుద్భ
విస్తుంది. అలా గాకుండా యెవరికివారే యన్నట్లు యెవరియిష్ట
మొచ్చినప్పుడు వారు విప్లవపంథాననుసరిస్తే ప్రమాదం
వస్తుంది. ఇదిమాత్రం మీరు మీజీవితములో మరువరానిది!

అట్టి శాస్త్రీయ విప్లవపంథాలో మనం గమ్యస్థానం
చేరుతాం. ధనమదాంధులయిన స్వార్ధపరుల హస్తగతమయిన
రాజ్యాంగము కష్టజీవులయిన మనవశమౌతుంది. దానికి మన
మంతా కృషిచెయ్యాలి. కార్మికకర్షకసంఘములువిరివిగ స్థాపిం
చాలి. సంఘబలాన్ని వృద్ధిచేసుకోవాలి. కార్మికకర్షక సంఘా
ల్ని సోదరభావంతో మెలగునట్లు చెయ్యాలి. విప్లవశక్తుల్ని
యణగద్రొక్క సమకట్టియున్న మనవారి మితవాద నాయక
త్వాన్ని రద్దుపరచాలి. సామ్యవాదానికి జోహారులివ్వాలి. అంత
ర్జాతీయ కార్మికకర్షకచిహ్నమగు ఎఱ్ఱజెండాను చేబూనాలి.
గమ్యస్థానము చేరులోపల యెన్ని యిక్కట్టులు సంభవించినను
చలించక వాటి నెదుర్కొనాలి.



సీ॥ స్వార్థచిత్తులగుండె ♦ చక్కలయ్యెడురీతి
యెఱ్ఱనిజెండాలు ♦ యెగురవలయు
సామ్రాజ్యవాదుల ♦ న్నాగనంపితిమంచు
యెఱ్ఱనిజెండాలు ♦ యెగురవలయు
విశ్వశ్రామికవర్గ ♦ విజయ చిహ్నములోడ
యెఱ్ఱనిజెండాలు ♦ యెగురవలయు.
సుత్తియున్గొడవలి ♦ సొంపుతో మెఱయంగ
యెఱ్ఱనిజెండాలు ♦ యెగురవలయు.
తే॥ గీ॥ విశ్వకార్మిక కర్షక ♦ విభవములను
సమముగా పంచియిచ్చియు ♦ శాశ్వతముగ
వీధివీధుల వెంబడి ♦ వెల్లువిరియ
నెఱ్ఱజెండాలు విరివిగ ♦ నెగురవలయు.

ఏదీ మీ సామ్యవాద స్వతంత్రాభిలాషను ఒకసారి యెలు
గెత్తి చాటండి.

అందఱు:- సోవియట్ భారత్ కి జై! ప్రపంచ కార్మిక
కర్షకులకు జై!! విప్లవము వర్ధిల్లుగాక !!! [సభ ముగింపబడును]

## 9వ రంగము.

[బీడు ప్రదేశము- కూలీలు తుమ్మకొమ్మలను నరుకుతుంటారు-
కొంతదూరమున బళ్ళత్రోవలో కారు ఆగుతుంది. యువకుని
అరెస్టు చేయమని ఇద్దరు పోలీసులను పంపుతాడు ఇనస్పెక్టరు.]

పో:—నిన్ను అరెస్టుచేయమని సర్కారువారి హుకుం.

కూలీలు:-(పనిమానివచ్చి) ఆయనేమి తప్పుచేశాడండి.

పో:-(వినుపించుకోకుండా) అలస్యం చెయ్యడానికి వీల్లేదు

కూ:—కొంచం తమాయించుకోండి.

పో:—ఏయ్! మీరు మాట్లాడకూడదు.

కూ:...గప్ చిప్! ముందు మీరు నోరు మూసుకోవాలి

యు:—సోదరులారా! తొందరకూడదని మీకెన్నో సార్లు చెప్పాను. ఇది కానిసమయము!

కూ:-సమయ మెందుకని కాదు. ఇదెంతపని? (అంటూ పోలీసులను బంధిస్తారు-మరికొంతమందివచ్చి కారుచుట్టుమూగి పోలీసులమీదపడి తమ యుత్తరీయములతో వారిని బంధిస్తారు)

యు:—అయినదేదో అయినది. పల్లెకు వెళ్ళుదాం రండి.

[నాటిసాయంకాలము కార్మికపల్లెవద్ద నాలుగు మోటారు లుంటాయి-రిజర్వుడుపోలీసులు తుపాకులను ప్రేలుస్తారు-ప్రజలంతా మోటారులకేసి పరుగెత్తుతారు.]

యు:—సోదరులారా! అవిగో యింకను మోటారులు వచ్చుచున్నవి. ఇతరచోట్ల అలజడి లేకపోవుటచేత పోలీసులంతా ఇక్కడికే చేరుకుంటున్నారు. ప్రభుత్వమువారు నన్నేమి చేసినను మీరు నిరుత్సాహపడకూడదు. విప్లవముహూర్తమును నిశ్చయించి కూలిరాజ్యమును స్థాపించాలి. అదియే నాకోరిక!

ప్రజలు:—నీకోర్కె తప్పక నెరవేరగలదు. (పోలీసులు యువకుని అరెస్టుచేసి కూలీలచే బంధింపబడిన పోలీసులను తీసుకొని వెళ్ళుతారు)



## 10వ రంగము.

[న్యాయస్థాన ఆవరణలో వేలకొలది ప్రజలుంటారు- రాజద్రోహిగా నెంచబడిన 'యువకుని' విచారణ]

న్యా:—నీవు ద్రోహివని నిరూపింపబడినది.

యు:—మీయక్రమశాసనానుసారము నేను ద్రోహిని కావచ్చునేమోగాని న్యాయచట్టానుసారము నేను ద్రోహిని కాను

న్యా:—ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వమును పతనమొనర్ప ప్రయత్నించిన నీవు ద్రోహివికాదా?

యు:—ఆకలిమంటచే మలమలమాడిపోతున్న అనాధలకు ఆకలిబాధ తీరాలంటే ఈప్రభుత్వ మంతరించాలి.

న్యా:—నీమాటలు నీద్రోహమునుబలపరచుచున్నవి.

యు:—ఏమైననగుగాక! అది నా నిశ్చయము.

న్యా:—నీకు జీవించుట కిష్టములేదా?

యు:—ఇది యధిక ప్రసంగము.

న్యా:-నీకొకయుపాయమును చెప్పెదను. యిష్టమేనా?

యు:—ఆచరణయోగ్యమయినచో.

న్యా:-క్షమాపణ కో...... (అని యేమో చెప్పబోవ)

యు:-(వీరావేశముతో కండ్లెఱ్ఱజేసి) ఛీ! దేశద్రోహి!

న్యా:— ఇది న్యాయస్థానమని యెరిగిమాట్లాడుము!

యు:—అవును. ఇది అన్యాయస్థానమని గుర్తించాను. కాని తమరు నేను భారతీయుడని గుర్తించాలి!

న్యా:—(తాను వ్రాసిన కాగితమును చూస్తూ) "విప్లవ నాయకుడవై విప్లవమును గలుగజేసి ప్రభుత్వమును పతనమొనర్చ ప్రయత్నములు చేయుచుంటివను" నేరము క్రింద నీకు మరణశిక్ష విధించబడినది.

యు:—(నవ్వుతూ) పరమానందం!

[యువకుడు విద్యుచ్ఛక్తి తీగను బట్టుకొనియుంటాడు.]

న్యా:—ఇప్పటికైనా నా మాటవినవా?

యు:—నన్నింక మాటలాడించవద్దు.

న్యా:—నీ కడసారి కోర్కెను గోరుకొనుము.

యు:—(పెదవులమీద చిరునగవు చిందులాడ)

తే॥ గీ॥ పదియుకొంపలు లేపట్టి • పల్లెనైన
సామ్యవాదమందిరములు • సౌఖ్యమొసగు
సామ్యవాదస్వతంత్రపు • శాసనములు
ఘనతమీఱగ భువిలోన • దనరుగాక!

న్యాయాధిపతీ! 'అంతర్జాతీయ సామ్యవాద స్వతంత్ర స్థాపనయే' నా కడసారి కోరిక.

[విద్యుచ్ఛక్తి మీట నొక్కబడుతుంది. యువకుడు కళ్ళుమూస్తాడు.]

(మరునాడు "యువకునకు మరణశిక్ష విధించిన న్యాయాధిపతి ఆత్మహత్య" యని పత్రికల్లో ప్రకటింపబడుతుంది.)

[దేశమంతటా విప్లవజ్వాలలు చెలరేగుతయి.]

సంపూర్ణము.

శ్రీపాండురంగాప్రెస్. రాజమండ్రి.

## జానకిరాం అండ్ కంపెనీ.

ట్రెయినింగు కాలేజీసందు యెదుట.

మెయిన్ రోడ్డు, రాజమండ్రి.

ఇక్కడ అసలురకం నీలగిరి గుండు, బద్ద కాఫీగింజలున్న్ని వేయించినవి, పచ్చివియున్న్ని, పౌడరును సరసమైన ధరలకు టోకుగాను, చిల్లరగాను దొరకును. పౌడరు మా ఎలక్ట్రిక్ యంత్రముపై ఎప్పటికప్పుడు తయారుచేసి యివ్వబడును.

మాచే తయారుచేయబడిన కాఫీగుండ పలువురచే సువాసనకు, రుచికి, మంచిదని కొనియాడబడుచున్నది. ఇంకను మావద్దనె 1రు పీకీలు, మంచిరకము తేయాకు టోకునను, చిల్లరగాను కూడ సరసమైన ధరలకు దొరకును.


## నైర్వైన్.

ఇది వీర్యనష్టముకలవారికి సంజీవివంటిది. ముష్టిమైథునము చేతను, మితిమీరిన సంభోగముచేతను తదితర కారణములచే తను కలుగు ఇంద్రియబలహీనతకు దివ్యౌషధము. శుక్లనష్టము రాత్రిస్ఖలనములు, నిద్రలేమి, ధాతుపుష్టి లేకపోవుట, నరము బలహీనత, తలనొప్పి. విరోచనబద్ధము, రక్తహీనత మొదల రోగములకు అమోఘముగా పనిచేయును.

## పాపులర్ హోమియో ఫార్మసీ.

ట్రెయినింగు కాలేజీసందు యెదుట.

మెయిన్ రోడ్డు, రాజమండ్రి.


దారిద్ర్యదావానలమునకు
ఆహుతియైన కృషీవలుడు